సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భావ వ్యక్తీకరణతో సృజనాత్మకత



బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: భావవ్యక్తీకరణ, తార్కిక వాదంతో సృజనాత్మకత బయటపడుతుందని విజ్ఞాన్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. కాపు జగ్గరాజుపేటలోని కళాశాలలో నవితాస్ క్లబ్ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ చాప్టర్‌లో 73 బృందాలు వివిధ ప్రాజెక్టుల ఎక్స్‌పో నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. ఈసీఈ విభాగాధిపతి వెంకటరమణ పాల్గొన్నారు.


పీ-4లో ప్రజల భాగస్వామ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ- 4 కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో ఇప్పటికే 15వేల పేద కుటుంబాలను అధికారులు గుర్తించారన్నారు. పీ-4 కార్యక్రమం ద్వారా ఆ కుటుంబాలు ఆర్థిక పురోగతిని సాధించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీ-4 స్పెషలాఫీసర్ దయానిధి, జోనల్ కమిషనర్ శేషాద్రి, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రచయితలు సమాజంపై బాధ్యతతో మెలగాలి



మాట్లాడుతున్న కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట: కవులు, రచయితలు సమాజంపై బాధ్యతతో మెలగాలని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు అన్నారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక, మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 11వ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితలు నిరంతరం సామాజిక చైతన్యం కలిగించే రచనలు చేయాలన్నారు. రామసుబ్బయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య మక్కెన శ్రీను మాట్లాడుతూ తెలుగు భాషకు ఇతోధికంగా సేవ చేయాలన్న లక్ష్యంతో 11 ఏళ్లుగా ప్రతి ఏటా కవులు, రచయితలకు సాహితీ పురస్కారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. సాహిత్య పత్రికల సహకారంతో ఏటా కవితలు, కథలు, వ్యాసాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారానికి ఎంపికైన మల్లారెడ్డి మురళీమోహన్, డాక్టర్ కె.వి.రావు సాహిత్య పురస్కారానికి ఎంపికైన ర్యాలీ ప్రసాద్, మక్కెన రామసుబ్బయ్య కథా పురస్కారానికి ఎంపికైన అచ్చల ఉమామహేష్, బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైన కె.వి.లక్ష్మణరావు, మనోవికాస వైజ్ఞానిక సాహిత్య పురస్కారానికి ఎంపికైన పి.చంద్రశేఖర అజాద్‌లకు మక్కెన శ్రీను చేతుల మీదుగా నగదు పురస్కారం అందజేసి సత్కరించారు. విశాఖ సంస్కృతి సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన సభలో మేడా మస్తాన్‌రెడ్డి, రచయితలు ఎం.సుగుణరావు, మాకినీడి సూర్యభాస్కర్, జడా సుబ్బారావు, కె.ఎ.ముని సురేష్ పిళ్లై తదితరులు పాల్గొని రామసుబ్బయ్య ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

మూసేయడానికే మొగ్గు!

- వీవీవీ పాఠశాల ఉపాధ్యాయులకు వీఆర్ఎస్ యత్నం
- స్టీల్‌ప్లాంట్‌కు కూటమి ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు



స్టీల్‌ప్లాంట్ తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)



సాక్షి, విశాఖపట్నం : పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పాఠశాలను కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బ్రతిమాలుతుంటే ఆ పాఠశాల ఉపాధ్యాయులకు వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్(వీఆర్ఎస్) ఇచ్చి పంపేయాలని విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలు ఉక్కు యాజమాన్యానికి సిఫార్సు చేయడం పట్ల అందరూ నివ్వెరపోతున్నారు. అధికారంలో ఉన్నవారు పాఠశాలను నిలబెట్టాల్సింది పోయి మూసివేయడానికి మద్దతివ్వడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. **వివరాల్లోకి వెళ్తే..**

నాలుగు దశాబ్దాల కిందట స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల కోసం ఉక్కునగరంలోని సెక్టార్-5లో విశాఖ విమల విద్యాలయం(వీవీవీ) తెలుగు మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు. నగరానికి చెందిన డయాసిస్ సంస్థకు పాఠశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అక్కడి ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లించేవారు. దాదాపు రెండు వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో 28 మంది పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, 60 మంది సిబ్బంది ఉన్నారు. పాఠశాల నిర్వహణకు ఏడాదికి రూ.5 కోట్లు వ్యయం అవుతోంది. ఫీజుల రూపేణా రూ.2 కోట్లు వసూలవుతుండగా, మిగిలినది ఉక్కు యాజమాన్యం సహాయంగా అందజేస్తూ వస్తోంది. గతేడాది ఉక్కు యాజమాన్యం పాఠశాల నిర్వహణకు తాము సహకరించలేమని, సొంత నిధులతో నిర్వహించుకోవాలని తేల్చింది. దీంతో రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఆ ఒత్తిడికి లొంగి గతేడాది పాఠశాల నిర్వహణకు యాజమాన్యం ముందుకు వచ్చింది. ఈ ఏడాది కథ మళ్లీ మొదటికి రాగా.. మూడు నెలల క్రితం డయాసిస్ సంస్థ పాఠశాల కొనసాగించడానికి అనుమతి కోసం ఉక్కు యాజమాన్యానికి లేఖ రాసింది. అయినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన కనిపించలేదు. ఇతర పాఠశాలలు ప్రారంభమై మూడు వారాలవుతున్నా వీవీవీ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ అంశంపై గత నెల 23న ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో యాజమాన్యం పాఠశాలను తెరవడానికి సంబంధించిన అనుమతి పత్రం ఇస్తామని చెప్పినట్టు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇది జరిగి రెండు వారాలు కావస్తున్నా పాఠశాల తెరవకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు టీసీలు తీసుకువస్తామంటే ఇతర పాఠశాలలు అంగీకరించడం లేదని, ఇలాగైతే ఈ ఏడాది తమ పిల్లల చదువు సంగతేంటని వారు వాపోతున్నారు.

బట్టబయలైన కూటమి ప్రభుత్వ నైజం..

ఇదిలా ఉండగా ఈ అంశంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌లను కలిసి పాఠశాల తెరిచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము ప్రయత్నిస్తున్నామని, ఉక్కు యాజమాన్యం వినటం లేదని ఎంపీ, ఎమ్మెల్యే పలుమార్లు వారికి చెబుతూ వచ్చారు. ఒకవైపు వారితో అలా చెబుతూ మరోవైపు యాజమాన్యానికి ఉపాధ్యాయుల వీఆర్ఎస్ కోసం సిఫార్సు చేయడం పట్ల కూటమి ప్రభుత్వం నైజం బయట పెట్టారు. ఎన్నికల ముందు అందరినీ ఉద్ధరిస్తామని ఊదరగొట్టిన ఈ నాయకులు.. విద్యార్థుల చదువు విషయంలో నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల వల్లే పాఠశాలకు ఈ దుస్థితి..



విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేల వల్ల ప్రారంభం కావాల్సిన పాఠశాల మూసివేసే పరిస్థితులకు చేరుకుంది. అధికారంలో ఉన్న కూటమి ప్రజాప్రతినిధులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పిల్లల చదువుల బాధ్యత తీసుకోవాల్సింది పోయి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే పాఠశాలను మూసివేయడానికి సన్నద్ధం చేస్తున్నారు. పాఠశాల తెరిచే వరకు ఉద్యమం ఉధృతం చేస్తాం.

– డాక్టర్ బి.గంగారావు, 78వ వార్డు కార్పొరేటర్

విమల విద్యాలయం తెరవాలని ధర్నా



విశాఖ విమల విద్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయాన్ని వెంటనే తెరిపించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. విశాఖ విమల విద్యాలయం మూసివేతకు జరుగుతున్న ప్రయత్నాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు మద్దతు పలకాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు 2 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పాఠశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా పాఠశాల ఉపాధ్యాయులు ఉదయం పాఠశాల ముందు నిరసన కొనసాగించారు. పాఠశాలను తెరిపించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అల్మారాలు, నోట్ పుస్తకాల అందజేత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి దరి పెదమడక ప్రాథమిక పాఠశాలలకు గజా ఇంజినీరింగ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో రెండు అల్మారాలు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందించారు. సంస్థ ఇన్‌చార్జి గంధోళి అప్పలకొండ శనివారం పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌కు అందజేశారు. గ్రామ నాయకులు కొలిపాక అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు, మోటూరి వెంకటరమణ, విందుల నారాయణరావు, దొడ్డి దేముడు, మజ్జి శ్రీనివాసరావు, బేతా హనుమంతురావు, గంధోళి నరసింగరావు, గుదే రాజు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి దర్శించుకున్న ప్రముఖులు

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా అగనంపూడిలో జగన్నాథస్వామిని శనివారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకుడు గురు త్రినాథ్ కుటుంబ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తర్వాత అభిషేకాలు జరిపించారు. 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ), జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నక్కా రమణబాబు, నియోజకవర్గ నాయకులు బొడ్డ గోవింద్, మామిడి శ్రీను, చిత్తా బుజ్జి, ఆలయ అర్చకులు గురు సంతోష్, మాజీ చైర్మన్ గొల్లవిల్లి వెంకటరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తిప్పల దేవన్‌రెడ్డి

వైభవంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర

పెదగంట్యాడ: జగన్నాథస్వామి ఉత్సవాలు ముగింపులో భాగంగా శనివారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథస్వామి ఆలయంలో నీలాచల్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్రతో పాటు జగన్నాథ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రమోద్ సారంగి అధ్యక్షతన స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టం పజేసి తిరుగు రథయాత్రను వైభవంగా నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి ప్రారంభమైన రథయాత్ర కోరాడ, నెల్లిముక్కు, నీలాపు వీధి, హౌసింగ్‌బోర్డు కాలనీ నిర్వాసిత కాలనీలో అన్ని వీధుల్లో సాగింది. భక్తులు స్వామి వారి రథం లాగేందుకు పోటీ పడ్డారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మొగలపల్లి త్రిమూర్తులు, బొడ్డు కృష్ణారావు, పవన్‌సాయి, బెల్లాల సతీష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు

జై జగన్నాథ

ఉక్కునగరం: ఉక్కునగరంలో శనివారం జగన్నాథుడి బహుదా యాత్ర(తిరుగు యాత్ర) శనివారం వైభవంగా జరిగింది. సుభద్ర, బలభద్ర సమేతంగా జగన్నాథుడికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) పాండే దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపైకి తరలించారు. పాండే బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. అనంతరం భక్తులు జై జగన్నాథ్ నినాదాలతో రథాన్ని ఉక్కునగరంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలని వినతి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా స్థానికంగా ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, పోరాట కమిటీ సభ్యులు మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, రౌతు గోవింద్ అన్నారు. పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోర్టు నుంచి వచ్చే కాలుష్యం కారణంగా 64, 71, 72, 73, 75, 76వ వార్డుల ప్రజలు ఊపిరి తిత్తుల సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. గంగవరం పోర్టు నుంచి జగ్గు జంక్షన్ వరకూ నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ఆ సమయంలో దుమ్ము ధూళి కారణంగా వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారన్నారు. లోడుతో వెళ్లే వాహనాలకు టార్పాలిన్లు కప్పాలని, అలాగే ఆ రోడ్డులో ధూళి రేగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరారు. మెడికల్ క్యాంపులు పెట్టాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు.



పోర్టు యాజమాన్య ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికసించిన బ్రహ్మ కమలాలు



కళింగవీధిలో వికసించిన బ్రహ్మ కమలాలు

కూర్మన్నపాలెం: స్థానిక కళింగ వీధిలో పూసిన బ్రహ్మ కమలాలు చూపరులను ఆకట్టుకొంటున్నాయి. అరుదుగా పూచే పూలు ఇక్కడ దర్శనం ఇవ్వడంతో మహిళలు ఆకర్షితులు అవుతున్నారు. ఈ పూలు కనిపించిన ప్రాంతాల్లో మంచి జరుగుతుందన్న నమ్మకం ఉండడంతో అనేకమంది కళింగ వీధికి చేరుకొని వాటిని తిలకిస్తున్నారు. దానప్ప అనేవ్యక్తి తన ఇంటి ఆవరణలో బ్రహ్మకమలం మొక్క నాటారు. ఒకే సారి రెండు పూలు పూయడం గమనార్హం. రాత్రి పూట మాత్రమే వికసించడం వీటి ప్రత్యేకత.

సిరులతల్లికి తులసిపూజ



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె శోభారాణి తెలిపారు.

మెగా లోక్‌అదాలత్‌లో 1346 కేసుల పరిష్కారం



కక్షిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు తదితరులు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో రూ.6.97 కోట్ల విలువైన 1346 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యాయి. ఐదు బెంచీల్లో నిర్వహించిన శిబిరాన్ని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించారు. ఆయనతోపాటు న్యాయమూర్తులు ఎస్.కవిత, ఎం.వెంకట శేషమ్మ, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి తదితరుల సారథ్యంలో కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకున్నట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఐపీసీ కేసులు 104, ఎన్ఐ యాక్టు కింద 58 కేసులు, డీవీసీ కింద 11 కేసులు, ఎస్టీసీ కేసులు 1085, అడ్మిషన్లకు సంబంధించి 26, ఎంవీవోపీలు 26 కేసులు, ఈపీ 7, ఓఎస్ కేసులు 22, ఇతర కేసులు 7 పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.యశోధర వేదమణి, డి.చిరంజీవి, సభ్యులు జె.శంకరరావు, వి.వినోద్ కుమార్, బి.వెంకటలక్ష్మి, కె.సీతామహాలక్ష్మి, వి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ శిక్షణ ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్, న్యాక్ (ఎస్ఏసీ) సంయుక్తంగా ఎస్సీ యువతకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. గాజువాక న్యాక్ ట్రైనింగ్ సెంటర్ వేదికగా శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ శిక్షణ తరగతులను ప్రారంభించి అభ్యర్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. తొలుత 30 మందికి శిక్షణ అందిస్తున్నట్లు ఈ సందర్భంగా సత్యపద్మ వెల్లడించారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ రవికుమార్, సిబ్బంది భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.



ట్రైనింగ్‌కు ఎంపికైన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యపద్మ తదితరులు

సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి అభిరామ్ బ్లూ ఎవెన్ గేటెడ్ కమ్యూనిటీలో 13 కిలో వాట్స్ సామర్థ్యం గల సోలార్ పవర్ ప్రాజెక్టును శనివారం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీ ధరతో ప్రతీ ఒక్కరూ ఏర్పాటు చేసుకోవడం వల్ల తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. నీరు, బొగ్గు కొరత వల్ల భవిష్యత్ సోలార్ ఎనర్జీపై ఆధారపడి ఉంటుందన్నారు. పీఎం సూర్య ఘర్ యోజనలో భాగంగా ప్రతీ ఒక్కరూ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్లూ అవెన్ గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రావు, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఏడీఈ శివశంకర ప్రసాద్, ఏఈ లక్ష్మణరావు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ

జీవీఎంసీ కమిషనర్ అర్ధరాత్రి తనిఖీలు

అల్లిపురం: నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఆయన రామా టాకీస్, సౌత్ జైల్ రోడ్డు, సిరిపురం, పాండురంగాపురం, హార్బర్ పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఆలసత్వం వహించరాదని అధికారులు, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పోర్టు రోడ్డు, పాండురంగాపురం తదితర ప్రాంతాల్లో ఏయే ప్రాంతాల్లో ఎంత మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. సౌత్ జైలు రోడ్డు మార్గంలో 15వ ప్యాకేజీ రాత్రి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వ్యర్థాలు లేకుండా పరిశుభ్రపరిచి నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

ఎన్ఏడీ అధికారిపై దాడి.. నలుగురి అరెస్ట్

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ) అధికారిపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 27న నేవల్ ఆర్మమెంట్ డిపో డీజీఎం మల్లికార్జునరావుపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఎన్ఏడీలో విధులను ముగించుకుని భోజన విరామ సమయంలో క్వార్టర్స్‌లో ఉన్న తన ఇంటికి వస్తుండగా.. కేంద్రీయ విద్యాలయం వద్ద రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని ఆపి ఆయనపై దాడి చేశారు. విచక్షణారహితంగా పిడిగుద్దులు కురిపించారు. ఆయన హెల్మెట్ ధరించి ఉండటంతో తలపైనా, ముఖంపైనా దెబ్బలు తగల్లేదు. దాడికి పాల్పడిన వారిలో ఎన్ఏడీ ఉద్యోగి ఒకరు ఉండటంతో, కక్షపూరితంగానే దాడి చేశారని తెలుస్తోంది. మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ టీవీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటి వరకు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎన్ఏడీలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టడం వంటి ఏకపక్ష నిర్ణయాల వల్ల ఇబ్బంది పడుతున్నామనే కక్షతోనే దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. దాడికి పాల్పడిన ఎన్ఏడీ ఉద్యోగి బెహరా అరుణ్‌తో పాటు ఎల్లవిల్లి దినేష్ కుమార్, చిత్ర గణేష్ కుమార్, నడిపిల్లి నితేష్ కుమార్‌లను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరుణ్ కుమార్‌కు ఈ ముగ్గురు స్నేహితులు. అయితే అరుణ్ కుమార్ సుపారీ గ్యాంగ్‌తో కలిసి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దాడిలో ఒక సీఐటీయూ యూనియన్ హస్తం ఉందని కార్మికులు, ఇతర యూనియన్లు చెప్పుకుంటున్నాయి.



ద్విచక్రవాహనంపై వెళ్లిపోతున్న నిందితులు(సీసీ ఫుటేజీ)

ఐఎన్‌టీయూసీ నిరసన : ఎన్ఏడీ అధికారి దాడి ఘటనపై ఐఎన్‌టీయూసీ సభ్యులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, థర్డ్ లెవెల్ జేసీఎం సభ్యుడు సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్ఏడీ యూనియన్ నాయకులు సుపారీ గ్యాంగ్‌తో అధికారిపై దాడి చేయించారని ఆరోపించారు. హత్యాయత్నం చేయడంతో కార్మికులు భయాందోళన చెందుతున్నారన్నారు. కార్మిక సంఘాల నాయకులు కార్మిక చట్టాలను అనుసరించి పోరాటాలు చేసి అధికారులపై ఒత్తిడి తీసుకురావాలే తప్ప, దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. నిరసనలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



